కథా నిలయం
1599
శ్రీకాకుళం

# దూరం

'అన్ని హంగులూ వున్న గొప్ప సిటీ ఆంధ్ర రాజధాని. మంచి చోటుకే వెడుతున్నావు నువ్వు. దీన్ని అదృష్టమనే చెప్పాలి. వెళ్ళిరా. మళ్ళా ఈ ప్రాంతాలకొచ్చేప్పుడు యింకా పెద్దవాడివై రా! వెళ్ళు, బెస్టాఫ్ లక్!'

బస్సు వేగంగా నడుస్తోంది. పైమాటలు నన్ను వెంటాడుతునే ఉన్నాయి. అయినా వెలితి మనసునిండా నిండుకున్నది.

తెలుగు తనానికి ముఖ్యమైన అలంకారం యిక్కడ ముచ్చటించవలసిన అవసరం ఎంతైనా వుంది. సొంత వూరు వదిలి దూరంగా బ్రతుకుదామనే తపనని తెలుగు మనిషి సాధ్యమైనంతవరకూ చంపుకుంటాడనే నూటికి నూరుపాళ్ళు నిజాన్ని నాలాటి మనిషి కాదనలేడు.

ఆ జాతి నాది. ఆ మనిషి నేను.

నా జాతికాని మనుషుల్ని నేను చూచి ఖంగారుపడిన సంఘటనలు యిక్కడ ఉదహరిస్తాను.

ఒకటి_ఆరేళ్ళ క్రితం యాత్రలనెపం మీద పూరీ జగన్నాథం వెడుతుండగా కలకత్తా తరలి వెడుతున్న మద్రాసీని రైల్లో చూచినప్పుడు, రెండు— సామర్లకోట రైల్వేస్టేషన్ పక్కగా వో చిన్న పాకలో టీ షాపు పెట్టుకు బ్రతుకుతున్న మళయాళీని చూచినప్పుడు, మూడు— మా ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం చేస్తోన్న బాలన్‌తో మాటాడినప్పుడూను.

చిన్న ఉద్యోగాలు. వచ్చేది సిసలైన తెలుగు మనిషి తాలూకు కేవలం ఆడంబరాలకి చాలినంత జీతం వాళ్ళది. అయినాసరే వందల మైళ్ళదూరం వచ్చేసి నిశ్చితంగా బ్రతుకుతున్నారు.

విడ్డూరంగా ఉంటుంది. నేనే ఆ స్థితి కొచ్చేస్తే గుండె ఆగి చద్దుననిపిస్తుంది. నా మనుషుల్నీ, నా వూరునీ, నా అనుభూతుల్నీ— అన్నింటినీ వదిలేసి అంత దూరం వెళ్ళి, 'పెట్టె చాకిరీ' చేసుకు బ్రతికేదానికంటే మా వూర్లో రిక్షాలాగి బ్రతకడం మేలనే మనుషుల్లో నేనుంటాను.

ఇదీ నేను!

ఆంధ్రులు గర్వించదగ్గ చరిత్రగల తెలుగుగడ్డ మీద పుట్టి, పెరిగి, పెద్దవాడి నయ్యేను. ఆ దగ్గర్లోనే ఉద్యోగం చేసేను యిన్నాళ్ళూ; ఇప్పుడు పిడుగు పడినట్లు, ఎవడి కొంపో ఉద్ధరించాలన్నట్టు నన్ను బదిలీ చేయడం శిక్ష! గొప్ప శిక్ష!

రాజధాని గురించి నేనూ చెప్పగలను—

ఎన్నో తరహాల సంస్కృతీ — సంస్కారం, ఎన్నో జాతుల సంగమం, కళామయ మహానగరం. అలాంటి నగరానికి వెళ్ళడం ముదావహమనీ, కళ మీద మోజువున్న ప్రతీ మనిషి తిండి లేకపోయినా బ్రతికగల భాగ్య నగరమనీ నేనూ చెప్ప గలను— మరోడెవడైనా అక్కడికి బదిలీ అవుతే. బదిలీ అయ్యింది సాక్షాత్తూ నాకు. నే నెలాటి మనిషినో నాకు తెలుసు.

నా అభిరుచులు చాలామందికి నచ్చక పోవచ్చు. పట్టి అనాగరికుడ్నని వేలెత్తి చూపించవచ్చు. కాని నేనంత త్వరగా మారలేను దూరంగా ఉద్యోగాలు చేస్తోన్న తెలుగు సోదరుల 'తెగింపు'ని మాత్రం హర్షించగలను.

భాగ్యనగరానికి బదిలీమీద కాకుండా ఏదో చూచి పోడానికని సరిపెట్టుకుంటే రెండు మూడు నెలలుండగలనేమో గానీ, 'బదిలీ నే తప్పదు. నువ్వు వెళ్ళాలి. లేకపోతే జీవితంలో నువ్వు దెబ్బ తినేయగలవని చెప్పి ముక్కుమీద కొట్టినట్టు నా కొచ్చిన కాగితం చూస్తుంటే రెండురోజులైనా ఉండలేనేమో ననిపిస్తోంది. గట్టిగా ఏడవాలని వుంది.

నాలాటి వాళ్ళకే తెలుస్తుంది నా యాతన. గుండె నిబ్బరం, కొంచెం సాహసం, ప్రతి చిన్న విషయాన్ని ఆనూ లాగ్రంగా పరిశీలించాలనే కుతూహలంగల వాళ్ళకి మాత్రం ఇది కవి

పిచ్చివాడు తీరిక వేళలో కట్టుకు ఆడుకుంటున్న వెర్రి ఆలోచనల గూడులాగుంటుంది. అయినా సరే, ఈ కథ రాస్తాను.

బ్రహ్మచారిగా జీవితం గడిపినన్నాళ్ళూ ఈ బదిలీ రాలేదు. అప్పుడొచ్చినా నా అభిప్రాయాల్ని కొంచెంగానైనా మార్చుకునేవాడిని పెళ్ళయింది. ముద్దుల మూటగట్టే చిరంజీవి పుట్టేడు. ఈ స్థితిలో నాకు బదిలీనా?

దిగులుగా బస్సెక్కాను. నన్ను తీసుకెళుతున్న బస్సూ కదల్లేక కదుల్తున్నట్టుంది. జగ్గయ్యపేట దాటేంత వరకూ మనసుని అదుపులో పెట్టుకోగలిగేను. అది కాస్తా దాటగానే నా కనిపించే ఎడారిలాటి ప్రదేశాన్ని చూస్తూ గొంతు దాకా వచ్చిన దుఃఖాన్ని అలాగే కప్పి పెట్టుకోడం ప్రారంభించేను. మా వేపున రోడ్లు ఇలావుండవు. కళగా ఉంటాయి. కాంతులు వెదజల్లుతాయి. రోడ్డు ప్రక్క భూములు యిలా దీన స్థితిలో ఉండవు. పచ్చటి పైరుతో నవ్వుతూ స్వాగతం చెబుతున్నట్టుంటాయి. భయంగా వుంది. పుట్టి పెరిగిన వూరు వదిలి కొత్త జీవితం 'ఒంటరిగా' ఎలా గడప గలను?

నిద్రపోవటానికి కళ్ళు మూసుకున్నాను. నిద్రలాటిదే కానీ సుఖమైన నిద్రని చెప్పను. కళ్ళు మూసుకున్నట్టు మాత్రం జ్ఞాపకం.

* * * *

నా ఆలోచనలకున్న రంగులు స్పష్టంగా చూచుకోగల అవకాశం హైద్రాబాద్ బస్టాండులో లభించింది.

నేను వస్తున్నట్టు రాముడికి తెలీజేశాను. వాడు నా మిత్రుడు. మా వూరివాడు. నాతో నాలుగేళ్ళు చదువుకున్న వాడూను. వాడీ నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. తెలుగు దేశం, తెలుగు ప్రజలు అని ఇరవై నాలుగ్గంటలూ జపం చేస్తూ కూర్చుంటే నీ జీవితమేంగాను? అని చెప్పి నా కా మధ్య ఉత్తరాలు రాశాడు. ఎంత తెగువతనం లేకపోతే అన్నేళ్లు పాటు ప్రత్యేకమైన వాళ్ళాఫీసు పనిమీద బొంబాయిలో నిశ్చింతగా గడిపి రాగలడు?

బస్సు దిగుతూనే రాముడికోసం వెతికేను. కనిపించలేదు. అంత రద్దీలో వాడు లేకపోయినందుకు దిగులుపడిపోయి ఉందును. కానీ వెంటనే కనిపించేడు శ్రీనివాసరావు.

శ్రీనివాసరావు బక్కగా రివటలా, ఎర్రగా అందంగా ఉంటాడు. చెయ్యెత్తు మనిషి. గట్టిగా గాలి వస్తే వంగిన రెల్లుగడ్డిలా వొరిగి పోగల ఆకారం.

అతన్ని చూస్తూనే గట్టిగా కేక పెట్టబోయేను. నా ప్రయత్నం అతనే ముగించేడు. నా రెండు చేతులూ పుచ్చుకుని కళ్ళతో ఆప్యాయత కురిపిస్తూ గుండెలనిండా నిండిన ఆనందాన్ని మాటల్లో ఒలికించేడు.

"మీరూ వచ్చేరా గురూగారూ!"

ఆ సమయాన, దూరానవున్న మా వూరిని శ్రీనివాసరావులో చూచి ఆనందించేను. వెంటనే సమాధానమూ చెప్పలేక పోయేను.

"పెట్టె బేడా బస్సులోనే ఉన్నాయా! రండి దింపిద్దాం."

మా వూరి శ్రీనివాసరావు ఈ వూళ్ళో ఉన్నట్టు తెలి యదు. నేనొస్తున్నట్టు తెలిసి శ్రీనివాసరావు నన్ను చూడ గానే కొండంత ఆదరం చూపించేడు. నా సామాను బస్సునించి దింపడంలో సాయపడ్డాడు.

అప్పుడడిగేను—

"మీ బంధువు లెవరైనా రావాలా?"

"బలేవారే? మీరుమాత్రం మా బంధువులు కారా?"

అతను కేవలం నాకోసం వచ్చాడంటే నే నమ్మను. లగేజీ తాలూకు శాల్తీలన్నీ సరిగ్గా చేరాయో లేదో లెక్క పెట్టుకున్నాను. శ్రీనివాసరావు అడిగేడు—

"చెప్పండి! ఇప్పుడు మనం ఎక్కడికి వెళ్ళాలి?"

"మీకు మా రామమోహనరావు తెలుసా?"

"ఆ మిలట్రీ మినసాలాయనా?"

"అవును."

"తెలుసు, అతను ట్రూప్‌బజార్లో ఉంటున్నాట్టా."

"కాసేపట్లో అతనొస్తాడు, అందరం కలిసే వెళదాం."

"మరి మీ రొస్తున్నట్టు ఆయనకి తెలుసా?"

"రాశాను."

"అవుతే సర్లెండి"

"మీ కవతల వేరే పనులేమైనా..."

"నో... నో... ఫోంచేసి మనూరి బస్సుని చూద్దా మనిలా వచ్చేను. మిమ్మల్ని చూట్టంతో ఆ పని కాస్తా పూర్తయింది. నా అయామ్ ఫ్రీ" అన్నాడు శ్రీనివాసరావు

గాలిలో చేతులూపుకుంటూ. తర్వాత మెల్లిగా, హాయిగా అందమైన ఆడపిల్ల నవ్వినట్టు నవ్వేడు.

అతని నవ్వులో వెయ్యి దీపాలు వెలిగినమాట వాస్తవమైతే కావచ్చు. మా వూరికి దూరంగావుండి ఇంత హాయిగా నవ్వగలగుతున్న శ్రీనివాసరావుమీద కోపమొచ్చింది నాకు. సొంత వూరొదిలి విసిరి పారేసినట్టు దూరంగా బ్రతికే మనిషికి హాయిగా నవ్వడం చాలా కాకూడదు. నవ్వే హక్కు అతనికి లేదని నా అభిప్రాయం'

"ఎన్నాళ్లుంటారు?" మళ్ళీ అతనే అడిగేడు.

"బదిలీమీద వచ్చేను గనక ఎన్నేళ్ళని అడగండి." కసికొద్దీ అన్నాను.

"గూడ్"

మరింక అతనితో మాటలు పెంచుకోవాలనే అభిప్రాయం తెంచుకున్నాను: నేనింత దూరం వచ్చినందుకు జాలిపడి సానుభూతి పలుకుతుందనుకున్న నోరు 'శుభమని' యాగీ చేస్తే మండుకు రాదూ మరి?

అతనే చెప్పుకొస్తున్నాడు. అతనీ వూరొచ్చి రెండు నెలలయిందిట. ఇక్కడే వాళ్ళ బావయ్యగారి పరపతిమీద వో ప్రైవేటు కంపెనీలో చేరాట్ట: రెండు వందల పైచిలుకు జీతమట.

నేను రాముడికోసం ఎదురుచూస్తూ అతని మాటలన్నీ విన్నాను. గేటుదాటి వస్తున్న రాముణ్ణి చూడగానే శ్రీనివాసరావు చేతిని నొక్కి అన్నాను—

"మా వాడొస్తున్నాడు."

బ్రేకు వేసినట్లు శ్రీనివాసరావు మాట లాపేశాడు. రాముడు కిళ్ళీ నోటితో మెల్లిగా నవ్వుతూ సిగరెట్టుని వేళ్లతో అందంగా పట్టి ఉంచి ఓ కన్నుమూసి, కుడి చేత్తో నా భుజం తట్టుతూ అన్నాడు—

"సారీ మై డియర్ బాయ్! ఐ యామ్ లేట్!"

రాముడి అవతారంలో చాలా మార్పొచ్చి పడింది. వాడ నెత్తిమీద వెంట్రుకలు ఆరంగుళం మేర పెంచి దానికి తగ్గట్టు క త్తిరింపు వేయించేడు. ఒంటిని గట్టిగా అంటిపెట్టు కున్న ఫేంటుతోనూ, గాలికి రెపరెపలాడే కాగితంలాంటి షర్టుని భుజం వరకూ మడిచి కొత్తగా కనిపించేడు. ఇంగ్లీషు సినిమాలో పేరొందిన సినీమా నటుడిలా ఉన్నాడు. ఆ వేషం నాకు నచ్చదని వాడికి తెలీదు. ఇప్పుడు నా అభిప్రాయం చెప్పేందుకు అదే వేషం భయపెడుతోంది నన్ను.

పలకరింపుతో నవ్వక తప్పదన్నట్టే నవ్వేను.

సిగరెట్టు పొగని తమాషాగా వదిలి, కాలిన సిగరెట్టుని కసాయివాడి కత్తిలాగున బూటుక్రింద నలిపి అన్నాడు—

"కెన్ ఉయ్ గో నౌ?"

"సామానుంది" అన్నాను బెరుగ్గా.

వాడో పర్యాయం నా హోల్డాలూ, పెద్ద ట్రంకూ, రెండు అట్ట పెట్టెలూ, ఒక చేతిసంచీ చూచి ఘొల్లున అరిచేడు.

"నాన్‌సెన్స్. నువ్వొచ్చింది నాగాయలంక కాదు. బండెడు లగేజీ వెంట తెచ్చేవ్"

సిగ్గుపడ్డాను!

"ఎవడైనా చూస్తే—లాఫెట్ యువర్ ఫేస్!"

కోపం వచ్చింది,

"ఇప్పుడీ సంతనంతా ఎలా చేర్చడమనేది ప్రోబ్లమ్."

సహించలేక నేనూ నోరు చేసుకున్నాను.

"ఒకేయ్. తెచ్చింది నేను. నీ సాయంలేకుండా చేర్చుకోగల సత్తా నాకుంది. అనవసరంగా గొంతుచించుకోవద్దు."

విడిగా పడివున్న అట్టపెట్టెని ట్రంకుమీద ఉంచేడు శ్రీనివాసరావు. అప్పటిగ్గాని అతన్ని చూడలేను రాముడు.

"ఐసీ! మీరూ వచ్చారన్నమాట. అయితే చేయి కలపండి. ముందీసరుకు రిక్షాల్లో ఎక్కించండి" అన్నాడు రాముడు.

"నువ్వు కొంచెం రిక్షావాళ్ళతో బేరమాడు" అన్నాను ధైర్యంగా.

రాముడు టక్కుగా నవ్వేడు.

"నో బార్గెయిన్ బిజినెస్. ఇక్కడ మనసంగతి తెలీని రిక్షావాడులేడు. కమాన్. ఏయ్ గాడీ!" వాడెవడ్నో పిలిచేడు నా ప్రమేయం లేకుండా రెండు రిక్షాల్లో సామాను సర్దించేడు మూడో రిక్షాలో నన్ను కూర్చోపెట్టి వాడు నాప్రక్కన కూర్చున్నాడు. మిగిలిపోయిన శ్రీనివాసరావు నుద్దేశించి అన్నాను.

"మీరూ రండి"

"అయస్నెందుకురా ఇబ్బందిపెడతావ్. మీరు వెళ్ళి రండి మాస్టారూ! థేంక్స్. గుడ్ నైట్."

అంతా క్షణంలో జరిగిపోయింది. మా రిక్షాలు కది లాయి. శ్రీనివాసరావు ఒక్కడూ గేటుదగ్గర నించునిపోడం బాధకలిగించింది నాకు. అదే రాముడితోనూ అన్నాను. దాన్ని వాడు చాలా తేలిగ్గా తీసుకుని శ్రీనివాసరావుగురించి యిలా అన్నాడు.

"మంచివాడితోనే బోణీ అయ్యిందే నీకు. ఇకముం దతన్తో కలిసి తిరగడం మానుకో. కనిపించినా తప్పించుకు తిరుగు."

"ఏం ?"

"సివిలిజేషన్ తెలీని ఫూల్."

అదిరిపడ్డాను. రాముడు కొత్తసిగరెట్టు ముట్టించి మాట మార్చి అన్నాడు.

ఇ"క్కడ అన్ని సుఖాలూ ఉన్నాయి. కొంచెం అల వాటుపడితే జన్మకిక ఈ పూరొదిలిపెట్టి ఉండనని కూర్చుం టావ్."

ఇక్క డెన్ని సుఖాలున్నాయో, ఆరాత్రి రాముడి గదిలో రాముడు కొనుక్కున్న 'సుఖం' చూచి ఖంగారు పడిపోయాను. మేము పడుకునేముందు సూటుకేసులోంచి 'సీసా' తీసాడు. దాని ఖరీదు పదహారు రూపాయలచిల్లరని చెప్పాడు. గట్టిగా ఉపయోగిస్తే వారోజు సరదా అని

అన్నాడు. రెండు గ్లాసుల్లో పోసి ఓ గ్లాసు నాముందు పెట్టాడు.

అపళంగా పక్కమీంచిలేచి డాబాదిగి నడిరోడ్డుమీద నించుని గట్టిగా కేకపెడదామనిపించింది. నా ఖంగారుచూచి వాడు నవ్వేశాడు

"మరేంలేదు. మొదట్లో..." యేదో చెప్పబోయేడు

"నాన్సెన్స్—ఇదిట్రా నీ సివిలిజేషను?" గట్టిగా అరిచేను.

వాడు నానోటిని తనచేత్తో మూసి కొంచెంసేపు మాటాడేడు నెమ్మదిగా, నా ఒక్కడికే వినిపించేలా.

"ఉదయంపూట అంబలి తాగడమే సివిలిజేషను కున్న నీబోటివాడికి దీని ఘనత తెలీదు: దొరలుతాగేమందిది సివిలిజేషన్ దొరలకి తెలిసినంతగా నీకు తెలీదు. నీతీ, జాతీ సాంప్రదాయమూ చట్టుబండలూ అనే పరిమితమైన ప్రపంచంలో పుట్టిపెరిగిన నీకిది సివిలిజేషను కాదంటె ఆశ్చర్యపడ న్నేను లేటెట్ యీజీ! నువ్వుగూడా కొంచెం సిప్‌చేస్తే సంతోషిస్తాను శీనూ - నీయెదట పెరిగిపోతున్న నన్ను చూచి ఆశ్చర్యపోతూండు. నీఖర్మ నీది."

భాగ్యనగరాన్ని దూషించేటంత చాతుర్యం నాకు లేదు. నా కన్నుని నేను పొడుచుకునేంత సత్తాగూడా లేదు. నాకు పరిచయమైన మహానగరంలో నా చిన్ననాటి మిత్రుడింతగా మారిపోయినందుకు ఆశ్చర్యంగావుంది.

రాముడిగురించి నాకు బాగాతెలుసు. వాడు ఇంటి దగ్గర నల్లిలా బ్రతికిన భీరువు. మావూళ్ళో యేమైనా సాహ

సాలు చేశామని చెప్పుకుంటే అది నాలాటి కొందరుచెప్పే చెల్లుబడి అవుతుంది. తండ్రిచాటుపిల్లవాడు రాముడు. ఇంట్లో పెద్దన్నయ్య మొదలు విధవప్పవరకూ వాళ్ళవాళ్ళ అంతస్తుల మధ్య పెరిగిన ఘుడుడు రాముడు, ఇంట్లో చెప్పకుండా వాళ్ళందరి అనుమతిలేనిదే కేవలం తెలుగుసినిమా కళ్ళలేని దౌర్భాగ్యమే క్వాలిఫికేషన్‌గాగల రాముడు ఈ భాగ్యనగరంలో యింత ప్రముఖుడై వెలిగిపోతున్నాడంటే నాకు ఆశ్చర్యంగాదు ?

ఈవ్వాళ్ళో వాడికి రెండున్నరవందల జీతమొస్తుంది. ఖర్చు పెట్టుకోడానికి వందలైనా చాలని ఈవ్వాళ్ళో ఇరవై తారీకునుంచి జీతంకోసం ఎదురుచూచే రాముడు ఇంటిదగ్గర లేని జాతకాన్ని మరిచిపోతున్నాడు

మొదటి వారంరోజులూ బెంగగా గడిచేయి. మళ్ళా మావూరికి బదిలీకోసం ప్రయత్నించేను. ఫలించేసూచనలు కన్పించకపోగా నాకున్న 'ఇంటిబెంగ'ని యాగీచేసినక్షణాలు భరించలేకపోయాను. చివరికి వో మొండిధైర్యం కలుగుతున్నట్టు పనిగట్టుకలిగాను.

రాముడు గదిలోనే కాలం గడుస్తోంది. మనిషిని ఉత్తేజపరిచే 'మందు'ల్లోని వివిధరకాలూ రాముడు చవిచూస్తూంటే కళ్ళప్పగించే నేను వోనాటిరాత్రి నన్ను నేను 'అదుపు'లో పెట్టుకోలేకపోయాను. వాడు ఆనందం అనుభవిస్తోండగా నోరు తెరుచుక అడిగాను.

"ఒరే కొంచెం నాకూ పోయరా! తాగాలనివుంది."

వాడు పకపకా నవ్వేశాడు. గ్లాసులో కొంచెంపోసి నాభుజం తట్టుతూ అన్నాడు.

"కళ్ళు తెరిచిన పసికూనా! రంగుల ప్రపంచాన్ని నీ సొంతం చేసుకోయిక. గుడ్ లక్."

తాగేను. గుండెల్లో మంటగావున్నా మరోతడవ గ్లాసులో పోసుకుని తాగాను. తాగి హోల్డాలుమీంద నడుం వాల్చేను. నా వ్రేళ్ళమధ్య సిగరెట్టుంచేడు రాముడు.

ఉదయానికి కొండని మింగేంత ఆకలివేసింది. ఆరోజు లగాయితు రాముడు చెప్పిన రంగులప్రపంచంలో నడవడం ప్రారంభించేను. నవోత్సాహాన్ని సంపాయించుకుంటున్నాను. కొన్నాళ్ళకి గమనించింది. ఈ నగరంవచ్చినక్షణం దిగులుతో చచ్చేను. ఇప్పుడలా లేదు. లక్షల జనాభాని భరిస్తోన్న ఈ నగరానికి నేనూ వో పౌరుడినయ్యాను. మా వూరూ, మా రోడ్లూ ఒక్కొక్కటే మరువగలుగుతున్నాను.

వోరోజు సాయంత్రం అద్దెగదికి వస్తూన్న వేళ కోఠీ ప్రాంతంలో అంతరద్దీలో ఇరువైపులావున్న ఖరీదైనషాపుల్ని చూస్తూ నడుస్తోన్న శ్రీనివాసరావు నన్ను ఢీకొన్నాడు. నేనూ, అతనూ మొహామొహాలు చూచుకొన్నాం. అతను చప్పున నా రెండుచేతులూ పుచ్చుకుని ఆదరంగా అన్నాడు.

"మళ్ళీ యెన్నాళ్ళకి మిమ్మల్ని చూచాను మాస్టారూ! కులాసానా?"

ఇంతదూరం ఒలికిస్తోన్న శ్రీనివాసరావుని యిన్నాళ్ళూ తెలుచుకోనైనా లేసందుకు నొచ్చుకున్నాను.

"రండి కాఫీ తాగుదాం" అన్నాను.

అతను నావేపు చిత్రంగా చూచి అన్నాడు.

"ఈవూర్లో కాఫీ తాగడమే. వద్దుమాస్టారు. ఆ అలవాట్లు మానుకోండి."

ఇప్పుడు నేను నేర్చుకున్న అలవాట్లని యేకరువుపెడితే విని మతిపోగొట్టుకోగలడు శ్రీనివాసరావు. నిప్పులాటి శ్రీని నిప్పులాటి శ్రీనివాసరావుని చూచి నాలోని 'తాగుబోతు' సిగ్గుపడ్డాడు. భయమూ వేసింది.

శ్రీనివాసరావు తనతో తెచ్చుకున్న ఫ్లాస్కుని చూపించి అన్నాడు ఉపన్యాసధోరణిలో.

"ఇక్కడ మూడుపూటలా కాఫీతాగాలంటే రెండు మూడు రూపాయలైనా జేబులో వేసుకోవాలి. అందుచేత యింటిదగ్గరే కాఫీ చేయించుకు తీసుకొస్తాను."

కాఫీకోసం రెండురూపాయలు ఖర్చుపెట్టడం యిష్టం లేని శ్రీనివాసరావు. నేను 'సీసా' కి కేటాయించిన ఖర్చు వింటే నా మొహం మళ్ళీ ఈజన్మలో చూడడు.

ఇద్దరం అలా యిష్టమొచ్చినట్టు తిరిగాము. తిరిగినంత సేపూ శ్రీనివాసరావు మావూరి ముచ్చట్లే చెప్పాడు. మావూరిపట్ల అతనికున్న గౌరవభావం గమనించి లోలోన నన్ను నేను తిట్టుకున్నాను. మావూరి ముచ్చట్లకి కొసమెరుపన్నట్టు అతనో విషయం వివరించి చెప్పాడు.

"రోజూ నేను బస్టాండుకి వెడతాను. ఈవూరొచ్చిన నాటినుంచీ ఈ అలవాటు ప్రారంభమైంది. మిమ్మల్ని రిసీవు

చేసుకున్నాడూ ఆ అలవాటుకొద్దే అక్కడికొచ్చాను. ఇదంతా యిందుకో తెలుసా మాస్టారూ! మహూరి బస్సు కోసం. ఆ బస్సుని చేతితో తాకి మహూరి సుఖాన్ని నెమరేసుకునేందుకు…"

అతని కనుకొనల్లో నీళ్లు నిలిచాయి.

ఆతర్వాత అతనొక్కడే బస్టాండుకి వెళ్ళిపోయాడు.

మొదట్లో శ్రీనివాసరావుని అపార్థం చేసుకున్నాను. ఈవూరికి అలవాటుపడి మావూరిని మరిచిన ఘనుడని భావించాను ఇప్పు డర్థమౌతోంది. శ్రీనివాసరావు 'అనాగరికు'డని రాముడెందుకన్నాడో.

బార్ ముందు ఆగాను. లోపలికెళ్ళి సీసా కొన్నాను. రిక్షాలో అద్దెగదికొచ్చాను గదిలో రాముడు ఇంగ్లీషు పాటేదో పాడుతున్నాడు.

* * *

ఓ ఆదివారం సాయంత్రం రాముడితో పాటు నౌబత్ పహాడ్ కి వెళ్ళాను. సాయంత్రం సరదాగా ఖర్చవడానికి అనుకూలమైన స్థలమది. మనసుకి గిలిగింతలు పెట్టే గాలి. అంత యెత్తునుండి కనుపించే మనోహర దృశ్యమూ ఏమానవుడినైనా ఆనందపరచగలవని హామీ యివ్వొచ్చు కొండ మెట్లెక్కుతూండగా శ్రీనివాసరావు మరో మనిషితో కనుపించాడు. అతని పేరు ఫణిభూషణరావుట. మావూరిదగ్గర చిన్న పల్లెటూరట. ఈ నగరానికి ఉద్యోగరీత్యా వచ్చాట్ట.

కొండమీద కాసేపు మేమందరం మాట్లాడుకున్నాం. ఫణిభూషణరావుకి ఇంగ్లీషు సినిమాలమీద వ్యామోహం ఎక్కువని అతని మాటల్లో పసిగట్టాను. సినిమాప్రపంచానికి సంబంధించినంతవరకూ అతని అభిమాన నటి సోఫియా, అతని అభిమాన నటుడు టోనీకర్టిస్‌నూ.

అతను రీజెంటు సిగరెట్లు కాలుస్తాడు. హాస్య ప్రసంగమంటే అభిమానముండొచ్చుగాని ప్రతి విషయాన్నీ తెలుగులో అనుకుని ఇంగ్లీషులో చెప్పడం మూలంగా వినేవాడికి యిబ్బందేను. ఓ చిన్న సంఘటన చెప్పాడు.

హైద్రాబాదులో బస్సుదిగి టాక్సీమీద హిమాయత్ నగరం వస్తూండగా దార్లో రోడ్డుకడ్డంగా ఓ తోరణం కనిపించిందట. దానిమీద 'సేమ్ డే' అని రాసుందిట. ఆరాత్రి ఓ ఫ్రెండు గదిలో పడుకుని 'సేమ్ డే'లో నటించిన నటులెవరన్న విషయమై చాలాసేపు ఆలోచించేట్టగాని ఎంతకీ తేలలేదట. పట్టుదలకొద్దీ ఉదయం పెందరాళే లేచి రోడ్డుమీదకొచ్చి యీ తోరణం మళ్ళా చూశాట్ట. ఆశ్చర్యమేమిటంటే అది యేసినిమా ప్రకటనా కాకపోగా ఒకానొక డ్రైక్లీనర్స్ వాళ్ళ హామీనట, యిది చెప్పి నవ్వేడు. అతని నవ్వుకి శ్రీనివాసరావు శృతికలిపాడు. నేనుగానీ, రాముడుగానీ నవ్వలేదు. దాంతో అతనికి వళ్ళు మండుకొచ్చిందో ఏమో—చివాలున లేచి నిలబడి వస్తానంటూ చెప్పి కదిలాడు. శ్రీనివాసరావు బిక్కుబిక్కుమంటూ మా యిద్దరివేపూ చూచి ఫణిభూషణరావుని అనుకరించాడు.

నేనేదో మాట్లాడబోయాను. నాచెయ్యి నొక్కాడు రాముడు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయింతర్వాత అన్నాడు.

"బలేమనిషిని సంపాయించాడు శ్రీను. రాత్రివేటలో దొరికేడేమొ."

"అదేమిటి ?"

"అవునోయ్! నీకోసం ఆనాడలావచ్చి ఎలా ప్రేమ ఒలికించాడో రాత్రి యీ ఫణిగాడ్నికూడా నెత్తిమీద పెట్టుకొని ఉండొచ్చుగా."

ఇంత కర్కశంగా మాట్లాడే రాముడిమీద నాకెంతైనా కోపంవచ్చింది. అందుచేత మాటలాడి చుట్టు ప్రక్కలు చూడటం మొదలెట్టాను; నన్ను గమనించిన రాముడు మాట మార్చాడు.

"ఆఫ్టరాల్ వో చిన్నమనిషి గురించి మన మాటల్ని వేస్టుచేయటం నాకిష్టంలేదు. మాటాడుకోటానికి చాలా విషయాలున్నాయి. సోలెట్మిసే సంథింగ్ ఎబౌట్ మిస్ పద్మ. ది మోస్ట్ ఛార్మింగ్గర్ల్!"

ఈ పద్మ యెవరోగాని నాప్రాణం తినేస్తుంది. నే నొచ్చిందగ్గర్నుంచీ వాడుచెప్పే ఈ పద్మకథ నశేషంగానే జరుగుతుంది. ఈకథకి అంతం యెప్పుడు దొరుకుతుందోగాని రాముడినోరు కట్టలేకపోతున్నాను. బొంబాయిలో ఆమధ్య జరిగిన యుకారిస్టు సభల్లో మా రాముడికి పద్మ అనబడే

తెలుగుపిల్లతో కలిగిన పరిచయం గురించి వరసక్రమంగా చెప్పడం వాడికే చేతకావడంలేదు.

ఆరోజుతోనైనా కథ పూర్తవుతుందనుకున్నాను. ఖర్మంకాలి వర్షంవచ్చే సూచనలు కనుపించడంతో మళ్ళా సశేషం పడ్డది. కొండమెట్లు దిగుతూండగా చిన్నజల్లు ప్రారంభమైంది.

కిందికిదిగి రోడ్డుమీదకొచ్చి బస్సుకోసం ఓ హోటలు ముందు నించున్నాము. మాకొంచెం దూరంగా వో అందమైన మంగలిషాపుముందు శ్రీనివాసరావు ఒక్కడూ నించున్నాడు. రాముడు వద్దని హెచ్చరిస్తున్నా గబగబా అతని దగ్గర కెళ్ళాను. రాముడికి కోపం వచ్చిందో ఏమో రిక్షాఎక్కి వెళ్ళిపోయాడు.

నన్ను చూస్తూనే శ్రీనివాసరావు చిన్నగా నవ్వాడు.

"ఫణిభూషణరావుగారేరి? మీరొక్కరే నించున్నారు?"

"అతను టాక్సీమీద సినిమాకెళ్ళాడు."

"మరి మీరు వెళ్ళలేదేం"

ఈవూళ్ళో సినిమా చూడటం నాకిష్టంలేదు,"

ఇంక అడగబుద్ధి పుట్టలేదు. నేనూ అతనిపక్కనే నిలబడ్డాను. మూడుబస్సులు నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయాయి. శ్రీనివాసరావు ఉద్రేకంగా అనేశాడు.

"ఈవూర్లో సగం జీవితం బస్సులకోసం యెదురు చూడ్డంతోనే గడిచిపోతుంది. ఇక్కడ జనం ఇలా యాంత్రి

కంగా బ్రతకాలి. నే చెప్పబోయేది ఈవూళ్లోవున్న మధ్యతరగతి జాతిగురించి. గాలీ వెలుతురూలేని చిన్న చిన్న యింటి వాటాల్లో బల్లుల్లా పడివుండాలి వీళ్లు ఉదయంలేవడం స్నానం గట్రా ముగిసినతర్వాత యింత నోట్లో వేసుకుని బస్సుకోసం పడిగాపులు పడడం ఆఫీసుకెళ్ళి మళ్ళా సాయంత్రం బస్సుకోసం యెదురుచూచి చివరికి సాధించి యిల్లుచేరుకోడం, స్నానం ముగించి యింత యెంగిలిపడి నిద్రకోసం యాతననుభవించడమూను. మళ్ళీ తెల్లవారడం, మళ్ళీ బస్సులూ, ప్రయాణాలూలు. ఇదంతా 'జీవించడం' కోసం, పొట్టపోషించుకోవంకోసం కళా గిళా వల్లకాడూ అంటూ అందమైన జీవితాన్ని ఆశించాలంటే చేతిలో అంతో యింతో ఉండాలి. నాకు విసుగుపుడుతోంది మాస్టారు! నిజం ”

నిజమేనేమో. నేనింత నిశితంగా ఆలోచించలేదుమరి. మావూరు వదిలొచ్చాననే దిగులు ఒక్కటే మొదట్లో ఉండేది. ఇప్పుడదీ దూరం అవుతోంది. అందుచేతనే పాత శ్రీనివాసరావు నాకు ఇవాళ కొత్తగా కనిపించాడు.

వర్షం బాగా తగ్గిపోడంచేతనూ, శ్రీనివాసరావు బలవంతంచేతనూ నడక ప్రారంభించాను. దార్లో శ్రీనివాసరావు గుండెల్లో దాగినకథ కదిలింది.

బి. ఏ. పాసయిన శ్రీనివాసరావు ఏడాదిపాటు గోళ్ళు గిల్లుకోడం, వాళ్ళ మేనమామకి బాధకలిగింది. ఉత్తరంరాసి శ్రీనివాసరావుని హైద్రాబాద్ తెచ్చుకున్నాడు. ఆయన పనిచేస్తున్న (ఎంతోకాలంగా) ప్రైవేటుకంపెనీలో ఉద్యోగం

వేయించాడు. ఆ కంపెనీ మంచి స్థితిలో ఉన్నది. జీతం పెద్దదే కాకుండా ఏడాదికి రెండు బోనసులట.

ఇంతకంటె ఏమావమాత్రం చేయగలడు ?

శ్రీనివాసరావు యింకా అన్నాడు.

"కానీ మాస్టారు! మావయ్య వెనక మావయ్యని మింగేంత స్వార్థముంది. ఆ స్వార్థానికి నే నొక్కడ్నే కాదు, మా అమ్మా నాన్నా అందరూ దెబ్బ తినేస్తున్నారు. మావయ్యకో కూతురుంది. దానికి నేను మొగుడ్నిట దైవ సాక్షిగా నేనే ఆడపిల్లనీ ప్రేమించలేదుగాని ఆడపిల్లంటే యిదిగో యిలా ఉండాలనే నా అభిప్రాయానికి పూర్తిగా వ్యతిరేకం ఆ అమ్మాయి అదే నాకు నచ్చనిది; రండి. వోమాటు మా మావయ్యవాళ్ళింటికొచ్చి అందర్నీ చూడండి. నానోటితో చెప్పితే మీరు నమ్మకపోవచ్చు."

వాళ్ళింటికి కావాలని చెప్పి వెళ్ళాను. ఇంటినిచూస్తూ శ్రీనివాసరావు చెప్పింది అబద్ధమేమో అనిపించింది. చాలా అందంగా వుంది యిల్లు. వాళ్ళ మావయ్యని పరిచయంచేసి శ్రీనివాసరావు ఇంట్లోకి వెళ్ళేడు.

ఆయనపేరు చెంగల్రావు. ఆయనగురించి రెండు ముక్కలు చెప్తాను. చెంగల్రావుగారికి నాకు నచ్చే తెలుగు రాదు. ఆయన మాట్లాడుతున్నది మాత్రం తెలుగే కాదనను కానీ ఆ భాష వోపట్టాన అర్థంకాదు. చెంగల్రావు వాళ్ళ అల్లుడి ఆగడం గురించి చెప్పదలుచుకున్నది సూక్ష్మముగా యిది.

'ఈవేళ మధ్యాన్నం మా అల్లుడు వాళ్ళాఫీసర్తో తగువు పడ్డాడు. అతణ్ణీ, ఆఫీసర్నీ ఇద్దర్నీ ఒప్పించి రాజీ కుదిర్చేందుకు నా తలప్రాణం తోకకొచ్చింది.'

ఈ రెండుముక్కల్నీ అయిదునిమిషాలు అటుదిటు ఇటుదటు చేసి ఆయన ఖంగారుపడి నన్ను ఖంగారు పెట్టాడు. రెండు ఆ కాసినిమాటల్లోనూ ఎక్కువభాగం 'యాదు'! ఫర్మాన్' 'కోషిన్' 'జరా' ల్లాటి పదాలు కోకొల్లలై తెలుగు మాటల్ని మింగేశాయి. ఇది నాకు బొత్తిగా నచ్చలేదు: వెంటనే వో అభిప్రాయానికి వచ్చేను. ఎక్కడో తెలుగు భాషాభిమానే కానక్కర్లేదు. మా వేపునుంచి వచ్చిన మనిషి ఈ యింటిలో వుండాల్సివస్తే పిచ్చెక్కుతుందని గట్టిగా చెప్తాను.

అంతమాత్రంచేత చెంగల్రావుగార్ని తప్పుపట్టటం చిరకాలంనుంచీ ఈ ప్రాంతాల్లో ఉంటున్నాడుగనుక ఆయనకి వరస నరసరాన జీర్ణించుకుపోయి ఉంటుంది.

చెంగల్రావుగారు మాట్లాడుతూండగా పక్కగదిలో శ్రీనివాసరావుని వో ఆడకూతురు గట్టిగా గదమాయిస్తుంది గొంతువిషయం యెలావున్నా వో ఆడపిల్లసైతం చెంగల్రావుగారి ధోరణిలోనే మాట్లాడటమనేది నా కష్టమనిపించింది. నాకు పూర్తిగా వినిపించినమాట యిది:

"దొరతో కొట్లాడినవంట గట్టకుదరు. మంచిగుండు."

శ్రీనివాసరావు ఆ పిల్లనోరెల్లా మూయించాడో తెలీదుగాని కాసేపటికి యిద్దరూ బయటకొచ్చారు. ఆ

అమ్మాయిని పరిచయం చేశాడు శ్రీనివాసరావు. అతని కాబోయే భార్య. పేరు యాదగిరమ్మ. మొహాన స్ఫోటకపు మచ్చలు. చామనచాయ. తండ్రినిమించిన స్థూలకాయం.

ఆ యింటినుంచి వచ్చేస్తూండగా అనుకున్నాను— ఈ భూమ్మీద పుట్టిన ప్రతీవాడు అదృష్టవంతుడు కాలేడు.

కొన్ని తమాషాగా జరుగుతాయి అవసరమున్నప్పుడు నాకు మావూరివేపు బదిలీకాలేదు. ఈ నగరంతాలూకు నాగరికతతో రాజీపడి కొంచెం సరదాగా తిరుగుతున్న సమయంలో అనుకోకుండా మావూరివేపే బదిలీవచ్చింది.

రేపుదయం వెడతాననగా నారాయణగూడ తాజమహల్ హోటల్లో రాముడు నాకు పార్టీయిస్తూన్న సందర్భంలో అనుకోకుండా శ్రీనివాసరావు హోటలుగేటుదగ్గర కలిశాడు. ఆహ్వానితుడు కాకపోయినా రాముడికి అతిథయ్యాడు. ఎనిమిదిగంటలకి పార్టీ ముగిసింది. శ్రీనివాసరావు నాచేతిని నొక్కుతూ అన్నాడు.

"అదృష్టవంతులు. గంగిగోవులాటి మనూరికి దగ్గరవుతున్నారు. ఇప్పుడు నాకెంత ఆనందంగా ఉండనుకున్నారు."

కానీ, అతని కళ్ళల్లో 'జెలసీ' లాటిది చూచాను.

ఆమర్నాడు హడావిడిగా బస్టాండుకు వెళ్ళాను. సూర్యుడింకా రాలేదు. మసక మసకగా ఉందింకా. బస్సు కదిలేవేళ అయింది. సామాను పైనవేయించి ఆత్రంగా బస్సెక్కాను. బస్సు కదిలింది. ముందుగా ఓసీటు ఖాళీగావుంది. గబగబా

అక్కడికివెళ్ళి కూర్చున్నాను. నా పక్కనున్న మనిషి కదిలి నావేపు చూచాడు.

అతను శ్రీనివాసరావు. ఉలిక్కిపడి అడిగాను.

"ఇదేమిటి మీరూ వస్తున్నారా?"

అతను సిగరెట్టు వెలిగిస్తూ కాల్చూపుతూ అన్నాడు.

"నా స్వర్గాన్ని వదిలి బ్రతకలేను మాస్టారు! టూర్యాషన్లు చెప్పుకునైనా మనూర్లో శాంతిగా బ్రతకగలను."

—ఆంధ్రసచిత్ర వారపత్రిక 1-9-65